మల్లన్న క్షేత్రానికి తరలిరానున్న భక్తులు

నేడు బ్రహ్మోత్సవాల పదో ఆదివారం

చేర్యాల, మార్చి 23: కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నేడు ఉత్సవాల 10వ ఆదివారం కావడంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. భక్తులు మల్లన్నను దర్శించుకోవడంతో పాటు పట్నాలు వేసి బోనాలు సమర్పిస్తారు. మహామండపం, గంగరేగు చెట్టు ఆవరణతో పాటు తాము బసచేసిన గదుల వద్ద పట్నాలు వేయనున్నారు. మరికొందరు భక్తులు మల్లన్న గుట్టపైన ఉన్న ఎల్లమ్మకు బోనం చేసి మొక్కులు చెల్లించుకోనున్నారు. మల్లన్న క్షేత్రంలో మొక్కుల అనంతరం కొండపోచమ్మ, నల్లపోచమ్మ ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ఈవో బాలాజీ, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు.

26 నుంచి బీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశాలు

సిద్దిపేట, మార్చి 23: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మెదక్ ఎంపీ స్థానానికి అభ్యర్థిగా సిద్దిపేట మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఖరారు చేసిన సంగతి తెలిసిందే. మెదక్ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి బీఆర్ఎస్ కార్యాచరణ సిద్ధం చేస్తున్నది. దీనికోసం ఈనెల 26 నుంచి మెదక్ పార్లమెంట్ స్థానం పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది. 26న ఉదయం 11గంటలకు సంగారెడ్డి నియోజకవర్గం, సాయంత్రం 5గంటలకు మెదక్ నియోజకవర్గ సమావేశాలు నిర్వహించనున్నారు. 28న ఉదయం 11గంటలకు సిద్దిపేట, సాయంత్రం 5గంటలకు నర్సాపూర్, 28న సాయంత్రం పటాన్‌చెరు, 29న ఉదయం 11గంటలకు దుబ్బాక, 30వ తేదీన 11గంటలకు గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తల సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

మెదక్‌లో బీఆర్ఎస్ విజయం నల్లేరు మీద నడకే

- ఈనెల 27న సిద్దిపేట నియోజకవర్గ కార్యకర్తల సమావేశం
- పెద్దఎత్తున తరలిరావాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ

సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, మార్చి 23: పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ ఎంపీ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఘన విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ అన్నారు. శనివారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు మోహన్‌లాల్, పాల సాయిరాం, గుండు భూపేశ్, ఎర్ర యాదయ్య, పక్రోద్దీన్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మిగిలిన జిల్లాల కంటే ఉమ్మడి మెదక్ జిల్లాలో అత్యధికంగా ఎమ్మెల్యే సీట్లు బీఆర్ఎస్ గెలుపొందినట్లు తెలిపారు. మెదక్ పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ బలంగా ఉందని, గెలుపు నల్లేరు మీద నడకే అన్నారు. సిద్దిపేట నియోజకవర్గం సమావేశం ఈనెల 27వ తేదీన నిర్వహిస్తామని, ఈ సమావేశానికి నియోజకవర్గంలోని 3వేల మంది ముఖ్య కార్యకర్తలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొంటారన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థికి వెంకట్రామిరెడ్డికి ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలతో మంచి సంబంధాలు ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో హరీశ్‌రావు నాయకత్వంలో తప్పకుండా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తప్పుడు హామీలతో గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు అయోమయానికి గురి అయ్యారని.. కానీ, 3 నెలల్లోనే కాంగ్రెస్ సర్కారుపై వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. రూ.2 లక్షల పంట రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ విషయం ఎత్తడం లేదని, ఇంకా పింఛన్లు, తులం బంగారం, వరికి బోనస్ తదితర పథకాలను అమలు చేయడం లేదన్నారు. ఇంకా రైతుబంధు సాయం పూర్తిగా ఇవ్వలేదన్నారు. ఓవైపు కరెంట్ కోతలు, మరోవైపు పంటలు ఎండిపోతున్నా రైతుల గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మహిళలు తాగునీటి కోసం రోడ్లపైకి వస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ పాలన వదిలేసి రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. మేడిగడ్డ పేరు చెప్పి పంటలకు నీరివ్వకుండా ప్రభుత్వం కేసీఆర్‌ను బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్న విషయం ప్రజలు గమనిస్తున్నారన్నారు. మిషన్ భగీరథ నిర్వహణ సరిగ్గా లేక ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతన్నారని, ఖాళీ బిందెలతో నిరసనలు ప్రారంభమయ్యాయని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదన్నారు. ఈనెల 27న సిద్దిపేటలో జరిగే నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు వేలేటి రాధాకృష్ణ శర్మ పిలుపునిచ్చారు.

పార్లమెంట్‌లో ప్రజల గొంతుకవుతా

ఉమ్మడి మెదక్ జిల్లాతో విడదీయలేని అనుబంధం

- బీజేపీ మత రాజకీయాలు చేస్తే... హామీలు నెరవేర్చలేక కాంగ్రెస్ చేతులెత్తేసింది..
- ఆ రెండు పార్టీలకు ఎంపీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పాలి..
- రిటైర్డు ఐఏఎస్ అధికారిగా, ఎమ్మెల్సీగా ప్రజల ఆకాంక్షలు తెలుసు
- అభివృద్ధిలో మెదక్ పార్లమెంట్‌ను అగ్రస్థానంలో నిలబెడతా..
- మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సంగారెడ్డిలో మాట్లాడుతున్న మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సంగారెడ్డి, మార్చి 23(నమస్తే తెలంగాణ): దేశంలోనే తెలంగాణను అగ్రభాగంలో నిలిపిన కేసీఆర్ విజన్ నిలబడాలన్నా... బీజేపీ మతరాజకీయాలకు, కాంగ్రెస్ మోసపూరిత రాజకీయాలకు చెక్‌పెట్టాలన్నా మెదక్ పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ గెలుపు ఎంతైనా అవసరం ఉందని బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. శనివారం సంగారెడ్డికి వచ్చిన ఆయన స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణను కలిశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు సహకరించాల్సిందిగా ఇద్దరిని కోరారు. అనంతరం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. మెదక్ పార్లమెంట్ మరింత అభివృద్ధి జరగాలన్నా, ప్రజల వాణి పార్లమెంట్‌లో వినిపించాలన్నా ఈ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీఆర్ఎస్ ఎంపీగా తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రజల గొంతుకు అవుతానని స్పష్టం చేశారు. మెదక్ కేసీఆర్ సొంత జిల్లా అని, ఇక్కడ ఓటర్లు ప్రతి ఎన్నికల్లో కేసీఆర్ వెన్నంటే నడిచారని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలతో తనకు ఆత్మీయ అనుబంధం ఉందన్నారు. సిద్దిపేట జిల్లాలో కలెక్టర్‌గా, మెదక్ జిల్లాలో తొమ్మిదినెలలు ఇన్‌చార్జి కలెక్టర్‌గా పనిచేశానని గుర్తుచేశారు. ఐఏఎస్ అధికారిగా పనిచేసిన తనకు మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలపై పూర్తి అవగాహన ఉందన్నారు. ఇక్కడి ప్రజల ఆకాంక్షలు, అవసరాలు తనకు తెలుసన్నారు. కేసీఆర్ సూచనల మేరకు ఎంపీ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా శ్రమిస్తానని తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆధ్వర్యంలో 26వ తేదీ నుంచి నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ సమావేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ తర్వాత మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీ క్యాడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేస్తామన్నారు. మండల కేంద్రాల్లో పార్టీ సమావేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలను దీటుగా ఎదుర్కొని ఎన్నికల్లో ఖంగుతినిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ అయోధ్య, శ్రీరాముడి పేరుతో ఓట్లు దండుకోవాలని చూస్తున్నదని విమర్శించారు. ప్రజలు మత రాజకీయాలను అండగా నిలిచే పరిస్థితి లేదన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నిలబెట్టుకోవడం లేదని విమర్శించారు. తప్పుడు హామీలు ఇచ్చి మోసపూరితంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నిజస్వరూపం ప్రజలకు అర్థమైందని, ఆ పార్టీకి ఈ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే కేంద్రం నుంచి మెదక్ పార్లమెంట్‌కు రావాల్సిన నిధులు, ప్రాజెక్టులతో పాటు కేంద్రీయ విద్యాసంస్థలను తీసుకువస్తానని చెప్పారు. నూతన రైల్వేలైన్లతో పాటు మెట్రో రైల్ విస్తరణకు కృషి చేస్తానని వెంకట్రామిరెడ్డి తెలిపారు.

వాహనాల తనిఖీలో రూ.50లక్షలు పట్టివేత

గజ్వేల్‌లో వాహనాల తనిఖీలో పట్టుబడిన రూ.50లక్షలు

గజ్వేల్, మార్చి 23: సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా శనివారం రూ.50లక్షలు పట్టుబడ్డాయని సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా సీపీ అనురాధ మాట్లాడుతూ.. శుక్రవారం రాత్రి 9గంటల ప్రాంతంలో అంబేద్కర్ చౌరస్తాలో సీఐలు సైదా, ముత్యంరాజు సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా టీఎస్36సీ 0198 వాహనంలో రాయపోల్ గ్రామానికి చెందిన బచ్చు రత్నాకర్ ఎలాంటి ఆధారాలు లేకుండా డబ్బులు తీసుకుపోతుండగా తనిఖీలో పట్టుబడడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశానుసారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి విస్తృతంగా వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు రూ.50వేలకు మించి డబ్బులను వాహనాల్లో తీసుకొని వెళ్లరాదన్నారు. ఎక్కువ డబ్బులు తీసుకొని వెళ్తే వాటికి సంబంధించిన పత్రాలను దగ్గరే ఉంచుకోవాలని, లేనియెడల డబ్బులను సీజ్ చేసి ఐటీ అధికారులకు అప్పగిస్తామని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వాహన తనిఖీలకు సహకరించాలని కోరారు.

భూకబ్జాలు చేసిన చరిత్ర నీది

- డిపాజిట్ రాని నువ్వు నన్ను విమర్శించడం సిగ్గుచేటు
- పార్టీకి ద్రోహం చేసిన వారికి పదవులు అమ్ముకుంటున్నావు..
- తూంకుంట నర్సారెడ్డిపై ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శలు

గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మార్చి 23: గజ్వేల్‌లో భూకబ్జాలు చేసిన చరిత్ర మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికే చెందుతుందని, కబ్జాల బాగోతం అంతా ఆయనకే తెలుసని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. శనివారం గజ్వేల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నర్సారెడ్డి హయాంలో నల్లాల బావి, పద్మశాలి బట్టల మిల్లు, సింగాయిపల్లిలో కబ్జా చేసిన భూమిని కాఫీ కంపెనీకి అమ్ముకున్నాడని, రాజీవ్ రహదారి వెంబడి ఉన్న చెట్లను, లారీల కొద్ది యూరియాను అమ్ముకున్నాడని ఆరోపించాడు. నర్సారెడ్డి చరిత్ర ఏందో, ఎవరూ దళారీ వ్యవస్థను నడిపిస్తున్నరో ప్రజలకు తెలుసన్నారు. 2009లో టీడీపీ తరపున తాను ఎన్నికల్లో పోటీచేస్తే, పీఆర్పీ తరపున నిలబడిన ఎలక్షన్ రెడ్డికి రూ.2కోట్లు ఇచ్చి ఓట్లు చీల్చి గెలిచాడన్నారు. 2014లో గజ్వేల్ నుంచి మరోసారి పోటీలో ఉంటే నాలుగు రోజుల ముందే ఫోన్ స్విచాఫ్ చేసుకుని కార్యకర్తలకు అందుబాటులోకి రాకుండా ఎక్కడికి పోయావని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ద్రోహం చేసింది నర్సారెడ్డే అన్నారు. 2018 తరువాత నాలుగున్నరేండ్ల పాటు ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో లేకుండా ఎక్కడి పోయావని ప్రశ్నించారు. 2023లో కేసీఆర్‌పై పోటీచేస్తే కనీసం డిపాజిట్ రాలేదని, తన ముందు నిలబడే దమ్ము లేదని, తానంటే వెన్నులో వణుకు పుడుతుందని వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీ చైర్మన్ పదవులను ఎంతకు అమ్ముకుంటున్నావో పార్టీ కార్యకర్తలకు చెప్పాలన్నారు. అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ పార్టీ పేరుతో మూడు నెలల కాలంలో ఎంత వసూలు చేశావో త్వరలోనే నీ చిట్టా ప్రజల ముందు బయటపెడుతానని పేర్కొన్నారు. మూడు సార్లు ఓడిపోయినా, ఎప్పుడూ ప్రజల మధ్యనే ఉంటూ వారికోసం పనిచేస్తున్న వ్యక్తిని తానని, నీ చరిత్ర విధానం ఏందో ప్రజలకు తెలుసని, విమర్శించే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. అనవసర ఆరోపణలు చేస్తూ మాట్లాడడం బాగాలేదన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమకారుడిపై పోటీచేసిన చరిత్ర తనదన్నారు. ప్రజల కోసం పార్టీలు మారాను తప్పా పదవుల కోసం కాదని వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు నవాజ్‌మీరా తదితరులు ఉన్నారు.

కొత్తపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మెదక్‌లో ఎగిరేది గులాబీ జెండానే

- బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పాలి
- బీజేపీ అభ్యర్థి రఘునందన్ కోతల రాయుడు
- మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం..
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక/రాయపోల్, మార్చి 23: రైతులకు సాగునీళ్లు ఇవ్వని కాంగ్రెస్‌కు, మతం పేరుతో ప్రజల మధ్యన విద్వేషాలు రగిలిస్తున్న బీజేపీకి ఎంపీ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు లేదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. శనివారం రాయపోల్ మండలంలో ఆయన పర్యటించారు. కొత్తపల్లిలో బీఆర్ఎస్ అధ్యక్షుడు దాసరి బాలనర్సు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశీస్సులతో రెండు పర్యాయాలు మెదక్ ఎంపీగా భారీ మెజార్టీతో తాను విజయం సాధించినట్లు గుర్తుచేశారు. దుబ్బాక ఎమ్మెల్యేగా సైతం విజయం సాధించానన్నారు. ఆది నుంచి మెదక్ పార్లమెంట్ ప్రజలు బీఆర్ఎస్‌కు అండగా ఉన్నారన్నారు. మెదక్ అంటేనే ఉద్యమ ఖిల్లా అని, ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లోనూ వెంకట్రామిరెడ్డి విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డికి ప్రజా పాలనపై పూర్తి అవగాహన ఉందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడంలో ఆయన దిట్ట అన్నారు. ఆయనకు ఉమ్మడి మెదక్ జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తుచేశారు. మెదక్ ఎంపీగా వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు కృషిచేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్, బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి...

గత శాసనసభ ఎన్నికల్లో డిపాజిట్ రాని కాంగ్రెస్ నాయకుడు గ్రామాల్లో ప్రొసీడింగ్‌లు పట్టుకుని తిరుగుతున్నాడని, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సాగు,తాగునీళ్ల కోసం ప్రజలు, రైతులు రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొందన్నారు. పంటలు ఎండిపోతున్నాయని, నీళ్లు ఇవ్వని కాంగ్రెస్‌కు ఓటు ఎందుకు వేయాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేవలం ఫోన్ కాల్‌తో కాల్వలకు సాగునీరు విడుదల చేశామన్నారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక ప్రజలు ఛీకొట్టినా బుద్ధి రాలేదని, ఆయనకు సోషల్ మీడియాలో, టీవీ చానళ్లలో డిబేట్లలో మాట్లాడడం తప్పా ప్రజా సమస్యలు పట్టవని, ఆయన కోతలరాయుడు అని విమర్శించారు. వెంకట్రామిరెడ్డి నాన్ లోకల్ అని రఘునందన్ మాట్లాడటం హాస్యాస్పదమని, వకీల్ అంటూ గొప్పలు చెప్పుకునే రఘునందన్‌కు రాజ్యాంగంపై అవగాహన లేదని ఎద్దేవా చేశారు. భారతదేశ పౌరుడు ఎంపీ ఎన్నికల్లో ఎక్కడి నుంచైనా పోటీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని డ్రామాలు చేసినా మెదక్ గడ్డపై ఎగిరేది బీఆర్ఎస్ జెండానేనని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు.

మర్కూక్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

మెదక్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తాం

- మర్కూక్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

మర్కూక్, మార్చి 23: మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాషాయజెండాను ఎగురవేస్తామని బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ధీమా వ్యక్తం చేశారు.శనివారం సిద్దిపేట జిల్లా మర్కూక్ మండల కేంద్రంలోని రంగనాయక దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 17 ఎంపీ సీట్లకు పదిహేడు గెలుస్తామన్నారు. దేశంలో బీజేపీకి ఈసారి 400 సీట్లు వస్తాయని, దేశం బాగుపడాలంటే, శాంతిభద్రతలు బాగుండాలంటే మోడీకి ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలవి కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఎన్నికల హామీలను విస్మరించిందన్నారు. రాబోయే 50 రోజులు కార్యకర్తలు కష్టపడి తన గెలుపునకు కృషిచేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు సింగం సత్తయ్య, ఎంపీటీసీ చైతన్యశంకర్‌రెడ్డి, అప్పాల మల్లేశం, కిశోర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిల్చుని పారిశుధ్య కార్మికుల నిరసన

- నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదని ఆవేదన

మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

నిజాంపేట, మార్చి 23: మెదక్ జిల్లా నిజాంపేట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం పారిశుధ్య కార్మికులు మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నాలుగు నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించక పోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం పారిశుధ్య పనులు చేపడుతూ స్వచ్ఛతకు కృషి చేస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా తమ సమస్యను పరిష్కరించాలని పారిశుధ్య కార్మికులు ప్రభుత్వాన్ని కోరారు. నిరసనలో పారిశుధ్య కార్మికులు రాజు, మైసయ్య, మల్లేశం, రవి, నాగవ్వ తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో వెంకట్రామిరెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మెదక్ ఎంపీ స్థానాన్ని గెలిచి కేసీఆర్‌కు కానుకిద్దాం

- మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

రామాయంపేట, మార్చి 23 : మెదక్ పార్లమెంట్ స్థానంలో భారీ మెజార్టీతో విజయం సాధించి అధినేత కేసీఆర్‌కు కానుక ఇద్దామని అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. శనివారం రామాయంపేటలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రామాయంపేట, నిజాంపేట మండలాల వ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలందరూ కలిసి పనిచేస్తే విజయం తమదేనని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కొద్ది ఓట్లతో మెదక్ అసెంబ్లీ స్థానాన్ని కోల్పోయామని, పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించి సత్తాచాటుదామని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు, మెదక్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, రామాయంపేట, కల్వకుంట పీఏసీసీఎస్ చైర్మన్లు అందె కొండల్ రెడ్డి, బాదె చంద్రం, కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే హైమద్, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, అస్నోద్దీన్, మర్కు దత్తు, శ్రీనివాస్, చింతల యాదగిరి, కృష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి అభ్యర్థిగా క్యామ మల్లేశ్

- మల్లేశాన్ని ఖరారు చేసిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- బీసీ వర్గాల్లో పట్టున్న నేత

క్యామ మల్లేశ్

సిద్దిపేట (నమస్తే తెలంగాణ ప్రతినిధి), మార్చి 23: భువనగిరి పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్ అభ్యర్థిగా ఇబ్రహీంపట్నం చెందిన క్యామ మల్లేశ్‌ను పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. క్యామ మల్లేశ్ ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడ స్వగ్రామం. ఆయనకు భార్య క్యామ జంగమ్మ, కుమారుడు అంజన్‌కుమార్, కుమార్తెలు ప్రియాంక, అవంతి, అరోణి ఉన్నారు. ఇంటర్ వరకు చదివిన క్యామ మల్లేశ్ 1992లో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్, 2003లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2014లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. అనంతరం ఆయన కాంగ్రెస్‌ను వీడి 2018లో బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి పార్టీలో క్రమశిక్షణ కలిగిన నాయకునిగా పనిచేసి పార్టీ అధినేత కేసీఆర్ మన్ననలు పొందారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంతో పాటు ఆయనకు బీసీ వర్గాల్లో మంచి పట్టున్నది. ఆయన కుటుంబానికి రాజకీయ నేపథ్యం లేకపోయినప్పటికీ, ఆయన స్వతహాగా పోరాట పటిమ కలిగిన నాయకుడు. బీసీలతో పాటు ఆయన సామాజికవర్గం అభివృద్ధి కోసం ఆయన ఎంతగానో కృషిచేశారు. మల్లేశ్ స్వగ్రామం శేరిగూడలో మొదటిసారి పంచాయతీ సభ్యుడిగా పోటీచేసి గెలుపొందారు. అనంతరం ఆయన స్వశక్తితో అనేక పదవులు పొంది విజయవంతంగా నిర్వర్తించి మంచి గుర్తింపు పొందారు.

నీరులేక ఎండుతున్న పంటలు



సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని కొత్తపల్లిలో నీరు లేక ఎండిపోయిన పొలం

రాయపోల్, మార్చి 23 : భూగర్భజలాలు అడుగంటి బోరుబావుల్లో నీరురాక వరి,మొక్కజొన్న తదితర పంటలు ఎండిపోతున్నాయి. రాయపోల్ మండలంలో యాసంగిలో రైతులు ఎక్కువగా వరి సాగుచేశారు.బోరుబావుల్లో నీరు తగ్గడంతో వేసిన పంటలు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్తపల్లి, లింగారెడ్డిపల్లి, రాయపోల్, తిమ్మక్కపల్లి, అనాజీపూర్, పెద్ద ఆరెపల్లి తదితర గ్రామాల్లో పంటలు ఎండుతున్నాయి.బోర్లు వేసినా నీరు రాకపోవడంతో రైతులకు పాలుపోవడం లేదు. కొండపోచమ్మ సాగర్ కాల్వల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడంతో రిజర్వాయర్ నుంచి సాగునీరందని పరిస్థితి ఉంది. కాల్వలు పూర్తిచేసి గొలుసుకట్టు చెరువులు నింపితే పంటలు ఎండిపోయే పరిస్థితి ఉండేది కాదని రైతులు పేర్కొంటున్నారు